క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆకర్ష్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్‌): మండలంలోని తంగెళ్లపాళెం ఎస్సీకాలనీకి చెందిన జి.పాపయ్య శనివారం అనారోగ్యంతో మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌ రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌ రెడ్డి ద్వారా మృతుడి అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు.

వలంటీర్ల నియామకం

సత్యవేడు: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్‌ పోస్టులు భర్తీ చేసినట్లు ఎంపీడీఓ బాలగణేశ్‌ తెలిపారు. శనివారం సాయంత్రం పార్టీ మండల కన్వీనర్‌ కే. సుశీల్‌కుమార్‌ రెడ్డి, మాస్టర్‌ స్కూల్‌ చైర్మన్‌కే. చంద్రశేఖర్‌ రెడ్డి , సర్పంచ్‌ రవిరెడ్డి సమక్షంలో వలంటీర్లు సుగుణ(చిన్న ఈటిపాకం), అనిత(వానెల్లూరు), మాతమ్మ(దాసుకుప్పం) అమర్‌నాథ్‌ (దాసుకుప్పం)లకు నియామకపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్‌ అసిస్టెంట్‌ శివయ్య రెడ్డి పాల్గొన్నారు.

నేడు గుర్రప్పనాయుడు కండ్రిగలో గడప గడపకు..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్‌): తొట్టంబేడు మండలం ఇలగనూరు సచివాలయ పరిధిలోని గాంధీ సెంటర్‌, గుర్రప్పనాయుడుకండ్రిగ, దళితవాడ గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు.

ఘనంగా గుమ్మళ్లమ్మ పొంగళ్లు



గుమ్మళ్లమ్మకు పూజలు చేస్తున్న సర్పంచ్‌ స్వప్న, గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కంచనపుత్తూరు గ్రామ దేవత గుమ్మళ్లమ్మకు గ్రామస్తులు భక్తిప్రపత్తులతో పొంగళ్లు పెట్టారు. అమ్మవారి విగ్రహాన్ని పాలతో అభిషేకించి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండడంతో పొంగళ్లు పెట్టటం ఇక్కడ ఆనవాయితీ అని గ్రామస్తులు చెప్పారు.

ప్రజల్లోకి విస్తృతంగా పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు

- గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం/పిచ్చాటూరు: కొత్తగా నియమితులైన గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లే జగనన్న పార్టీకి, ప్రభుత్వానికి రథ సారథులని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నారాయణవనం మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో, మధ్యాహ్నం పిచ్చాటూరు మండల పరిషత్‌ కార్యాలయ సమీపంలో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను మాత్రం తన దృష్టికి తేవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్యాలకు అనుగుణంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా తొప్పయ్య

సచివాలయ మండల కన్వీనర్‌గా మండలంలోని నీరువాయికి చెందిన జి.తొప్పయ్యను నియమించినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఆయన్ను జెడ్పీ ఫైనాన్స్‌ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్‌ సత్కరించారు. కార్యక్రమంలో నారాయవనం ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, పార్టీ నాయకులు ఏకాబరం, అన్నదొరై తదితరులు మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సారకాయలు, సచివాలయాల మండల కన్వీనర్‌ సుధాబాబు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌ నాయుడు, ఎంపీపీ హెచ్‌.రేఖ, సర్పంచ్‌లు కేజీ రోస్‌ రెడ్డి, సతీష్‌, అన్నాదురై, ఏఎంసీ మాజీ డైరెక్టర్‌ పాలపద్మనాభం, ఎంపీటీసీ సభ్యులు రమేష్‌ రాజు, శోభన్‌, వేలు నాయకులు మోహన్‌, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



వాలీశ్వరాలయ శివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీ వాలీశ్వరాలయ శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయ ఈఓ లత, పాలకమండలి చైర్మన్‌ సురేష్‌ శివరాత్రి బ్రహోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖ, పార్టీ మండల కన్వీనర్‌ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌ నాయుడు, రామగిరి సర్పంచ్‌ సతీష్‌, ఎంపీటీసీ సభ్యులు శోభన్‌, బేబి, నాయకులు కిరణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

శ్రీకాళహస్తి శ్రీ వాయులింగేశ్వరస్వామి మహా శివరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్‌ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్‌ను శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి చైర్మన్‌ అంజూరు శ్రీనివాసులు ఆహ్వానించారు. శనివారం ఉదయం పుత్తూరులో ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో అంజూరు కమిటీ సభ్యులతో పాటు కలిసి ఆహ్వానించారు.

సైన్స్‌ ప్రయోగాలతో మేధస్సు



సైన్స్‌ ప్రయోగాల గురించి వివరిస్తున్న ఐసర్‌ రిసోర్స్‌ పర్సన్‌ డాక్టర్‌ హర్షిణి చక్రవర్తి

బుచ్చినాయుడుకండ్రిగ/తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్‌): సైన్స్‌ ప్రయోగాలు చేయడం మూలాన విద్యార్థులలో మేధస్సు పెరుగుతుందని ఐసర్‌ (ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ రీసెర్చ్‌ సెంటర్‌) రిసోర్స్‌ పర్సన్‌ డాక్టర్‌ హర్షిణి చక్రవర్తి అన్నారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని చల్లమాంబపురం జెడ్పీ హైస్కూల్‌, తొట్టంబేడు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూలులో ప్రజాప్రగతి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఐఐఎస్‌ఈఆర్‌ తిరుపతి సంస్థ సైన్స్‌ ప్రయోగాలు నిర్వహించింది. ప్రయోగాల వల్ల విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన, ఆసక్తి కలుగుతుందని ఆమె అన్నారు. సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు తక్కువ ఖర్చుతో కూడిన పరికరాలను ఉపయోగించి వినూత్న ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, వర్కింగ్‌ మోడల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో పలు సైన్స్‌ ప్రయోగాలను చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టిబాబు, నాగలక్ష్మి, యోగరాజ్‌, ట్రస్టు సభ్యులు సుస్మిత, రాజారావు, తొట్టంబేడు ఉన్నత పాఠశాల సైన్స్‌ టీచర్లు ఆర్థర్‌, సుగుణమ్మ, టీచర్లు రమణయ్య, సిద్ధయ్య, వేణుగోపాల్‌, పద్మనాభం, వెంకటేష్‌, ఆశాలత, ప్రజాప్రగతి ట్రస్ట్‌ కో–ఆర్డినేటర్లు సుబ్రహ్మణ్యం, సుస్మిత, దేవేంద్ర సిబ్బంది రాజారావు, ఓంకార్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో వ్యవసాయ రంగంలో మార్పులు



డ్రోన్‌తో వరి పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఏర్పేడు: వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగం రైతులకు లాభదాయకంగా ఉంటోందని రాస్‌ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్‌ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని మునగలపాళెంలో రాస్‌ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంటలకు డ్రోన్లతో పురుగు మందుల పిచికారీపై ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, న్యూఢిల్లీ భారత పరిశోధనా మండలి వ్యవసాయ డ్రోన్ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్‌ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా వివిధ మండలాల్లో రైతుల పొలాల్లో డ్రోన్లను వినియోగించి ప్రదర్శనా క్షేత్రాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డ్రోన్‌ వినియోగంతో నీరు, పురుగుమందు, కూలీల ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. మామూలు పద్ధతికన్నా ఈ పద్ధతిలో పురుగుమందు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్‌తో ఎకరాకు పురుగు మందుల పిచికారికీ 6 నుంచి 8 నిమిషాల సమయం, 10 లీటర్ల నీరు అవుతుందన్నారు. అనంతరం 23 ఎకరాల చెరకు, వరి పంటలపై డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పద్మజ, రాంకుమార్‌, రైతులు పాల్గొన్నారు.

ఉయ్యాలసేవలో కల్యాణ వెంకన్న



ఉయ్యాలసేవలో ఉభయ నాంచారులతో వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉభయ నాంచారుల సమేతుడై శనివారం సాయంత్రం ఉయ్యాలసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో స్వామి వారికి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు అందుకున్న స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా మకర తోరణ తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి ఆలయ ప్రాకారంలో ఊరేగారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్‌, భద్రతా జమేదార్‌ విజయకుమార్‌ పర్యవేక్షించారు.

ఉరుసు కరపత్రాల ఆవిష్కరణ

రేణిగుంట: స్థానిక మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో ఈనెల 10 నుంచి నిర్వహించనున్న 64వ వార్షిక గంధ మహోత్సవ ఉరుసు ఉత్సవ కరపత్రాల ఆశ్రమ పీఠాధిపతి ఖ్వాజా జుబేర్‌ హయాత్‌ ఖాదరీ, ఆశ్రమ ట్రస్టీ రెహమాన్‌ షరీఫ్‌ శనివారం ఆవిష్కరించారు. ఆశ్రమ శిష్య బృందం సమక్షంలో దివ్య ఖురాన్‌ పఠించి, ఫాతెహా కార్యక్రమంలో కరత్రాలు ఆవిష్కరించారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి ఖ్వాజా జుబేర్‌ హయాత్‌ ఖాదరీ

రక్తహీనత బాధితులకు పౌష్టికాహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలగణేశ్‌

సత్యవేడు: గ్రామాల్లో ఐదేళ్ల పిల్లలు, 6–19 ఏళ్ల బాలికలు, గర్భిణులలో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి బలవర్ధకమైన పౌష్టికాహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బాలగణేష్‌ ఆదేశించారు. శనివారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌ టివి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలలో చేపల వ్యాపారం చేస్తున్న మహిళ అభ్యున్నతికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందన్నారు. 40, 60 శాతం సబ్సిడీతో డీసీసీ బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేస్తోందన్నారు. పలు కార్యాలయాల్లో రోజూ ముఖ ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్‌ఏఎస్‌)లో రెండుసార్లు సకాలంలో హాజరు నమోదు చేయాలన్నారు. సచివాలయ ప్రాంగణాలు శుభ్రంగా ఉంచాలని, క్లోరినేషన్‌ చేసి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేజర్‌ పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్‌ పాల్గొన్నారు.

‘అమృత్‌ సరోవర్‌’ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్‌

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్‌): ఉపాధి పనుల్లో కూలీలకు గిట్టుబాటు ధర రూ.257 వచ్చేలా పనులు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ శ్రీనివాస ప్రసాద్‌ అన్నారు. శనివారం మండలంలోని చిట్టత్తూరు పంచాయతీలో జరుగుతున్న ‘అమృత్‌ సరోవర్‌’ పనులను ఆయన పరిశీలించారు. మస్టర్‌ను పరిశీలించి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే పనులు ఏవైనా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రేమ్‌కుమార్‌, ఏపీఓ సుజాత, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని ఆశీర్వదించండి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

రేణిగుంట: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనను చూసి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఆశీర్వదించి గెలిపించాలని వైఎస్సార్‌ సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. రేణిగుంటలో శనివారం పట్టభద్రుల వద్దకు వెళ్లి కరప్రత ప్రచారం చేశారు.జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో నవశకానికి నాంది పలికి రికార్డు స్థాయిలో 2లక్షలకు పైగా పట్టభద్రులకు సచివాలయ ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌, సర్పంచ్‌ నగేషం, మండల కో–ఆప్షన్‌ సభ్యుడు సుభాన్‌రాజ, ఎంపీటీసీ సుందరమూర్తి, రమణ, నాగరాజు, కృష్ణమూర్తి, మస్తాన్‌ తదితరులు పాల్గొన్నారు.



కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



వరదయ్యపాళెంలో..



శ్రీకాళహస్తి : గజేంద్రనగర్‌లో..



ఏర్పేడు : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



తొట్టంబేడు : మందులు అందజేస్తున్న ప్రమీలమ్మ



శ్రీకాళహస్తి : మాట్లాడుతున్న ముద్దుకృష్ణారెడ్డి

ఏర్పేడు: ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని పాపానాయుడుపేటలో సర్పంచ్‌ లలిత, పీహెచ్‌సీ డాక్టర్‌ హర్షవర్ధన్‌ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ రకాల కేన్సర్లు, అవి ఏ కారణాల మూలాన సంక్రమిస్తాయి? చికిత్స గురించి ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది టాటాబాయి, భవాని, ఉష, వెలుగు సీసీ గురవయ్య పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్‌): ప్రపంచ కేన్సర్‌ దినోత్సవం పురస్కరించుకుని శనివారం తొట్టంబేడు మండలం చెంచులక్ష్మి కాలనీలో ప్రజలకు కేన్సర్‌పై స్టెప్స్‌ సంస్థ శ్రీకాళహస్తి పథక సంచాలకులు డాక్టర్‌ ప్రమీలమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యపరీక్షలు చేశారు. ప్రధానంగా మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి, గొంతు, ఇతర కేన్సర్‌ల లక్షణాలు, తీసికోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాన్‌ పరాగ్‌, గుట్కా, ధూమపానం, మద్యపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు రోజూ తీసుకోవాలన్నారు. అనంతరం మహిళలకు ఐరన్‌మాత్రలు, టానిక్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్‌ సుధాకర్‌ రెడ్డి, రమేష్‌, గాయత్రి, సురేష్‌ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని సాలిపేట, గజేంద్రనగర్‌లోని అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్‌ జావిద్‌ మాట్లాడుతూ, కేన్సర్‌ దీర్ఘకాలికమైన వ్యాధి అని, శరీరంలో ఏ భాగానికైనా ఇది సోకవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందితే దీని నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌ రేవతి, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద డీబీఆర్‌ ఆస్పత్రి వైద్యసిబ్బంది కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్‌ ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ విశ్వనాథ్‌, వైద్యులు వెంకటేష్‌, పద్మనాభ రెడ్డి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో...

వరదయ్యపాళెం: ఒకప్పుడు కేన్సర్‌ ప్రాణాంతకమని, ఇప్పుడు ఆ వ్యాధి నివారణకు మందులున్నాయని, ప్రాథమిక దశలోగుర్తించి చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని మోండలెజ్‌ సేవ్‌ ది చిల్డ్రన్స్‌ సంస్థ సూపర్‌వైజర్‌ కిరణ్‌ కుమారి అన్నారు. శనివారం మోండలెజ్‌ సేవ్‌ ది చిల్డ్రన్స్‌, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా స్థానిక జూనియర్‌ కళాశాలలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించాయి. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌ పద్మావతి, సంస్థ ప్రతినిధులు తులసి పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపును వివరిస్తున్న అశోకరాజు

నారాయణవనం: స్థానిక సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజి కళాశాలకు నేషనల్‌ బోర్డ్‌ ఆఫ్‌ అక్రిడేషన్‌ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని కళాశాలల చైర్మన్‌ డాక్టర్‌ అశోకరాజు తెలిపారు. శనివారం కళాశాలలో విభాగాధిపతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు ఇటీవలే లభించిన న్యాక్‌ ఏ ప్లస్‌ గుర్తింపుతో పాటు ఇప్పుడు ఎన్‌బీఏ గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవితకు అధ్యాపకులు, విభాగాధిపతులు అంకితభావంతో పనిచేయాలన్నారు. గుర్తింపు కోసం కృషి చేసిన ప్రిన్సిపల్‌ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులను అశోకరాజు అభినందించారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



గౌతమ్‌ (ఫైల్‌)

శ్రీకాళహస్తి రూరల్‌: మండలంలోని అరవకొత్తూరులో ఓ బాలుడి అదృశ్యమయ్యాడు. శనివారం శ్రీకాళహస్తి రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాలు..అరవకొత్తూరుకు చెందిన గౌతమ్‌(13)శుక్రవారం ఇంటినుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఆ బాలుడి తండ్రి మురళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి గురించి తెలిస్తే..9154141891, 8985996457 ఫోన్‌ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఇలా చేస్తే సహించం

శ్రీకాళహస్తి: జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఆ స్కూలు కమిటీ చైర్మన్‌ ఆర్కాడు శంకర్‌ హెచ్చరించారు. స్కూలు మైదానంలో రాత్రి వేళ కొందరు ఆకతాయిలు, మందుబాబులు చేరి మద్యం సేవిస్తున్నారు. ఇది గుర్తించిన ఆయన శనివారం పరిశీలించారు. మరోసారి పునరావృతం అయితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఈ-క్రాప్‌ నమోదు తప్పనిసరి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్‌): పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ–క్రాప్‌ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌.ప్రసాద్‌రావు సూచించారు. శనివారం మండలంలోని తాటిపర్తి, గురుకులపాళెం, పెన్నలపాడు గ్రామాల్లో రబీ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. నమోదు చేసిన వివరాలను పరిశీలించి మాట్లాడారు. సంచాలకులు ధనంజయరెడ్డి, జె.సుబ్రమణ్యం, మండల వ్యవసాయాధికారి నాగోలు సురేంద్రరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు చౌడేశ్వరి, చంద్రమ్మ, సుధాకర్‌, కవిత పాల్గొన్నారు.

రైలుపట్టాలపై మహిళ మృతదేహం



రేణిగుంట: రేణిగుంట– రైల్వే కోడూరు రైల్వే మార్గంలో మామండూరు సమీపంలో ఓ మహిళ మృతదేహం రైలు పట్టాలపై శనివారం లభ్యమైనట్లు రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ అనిల్‌ కుమార్‌ తెలిపారు. సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగిన మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోందన్నారు. మృతురాలు పసుపు రంగు చీర, ఎరుపు రంగు జాకెట్‌ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించామని, ఎవరైనా గుర్తిస్తే 9292403084, 9542166850 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కార్పొరేట్‌కు మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు



నారాయణవనం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌ పాఠశాలల్లో కంటే మిన్నగా సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ మస్తానయ్య పిలుపునిచ్చారు. శనివారం డీఈఓ శేఖర్‌తో కలిసి స్థానిక బాలికోన్నత పాఠశాలలో అటల్‌ థింకింగ్‌ ల్యాబ్‌, లైబ్రరీని పరిశీలించారు. విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. నాగిలేరు ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద, నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక తదితర పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంఈఓ భారతి విద్యాప్రగతిని వివరించారు. జిల్లా సెక్టోరియాల్‌ అధికారులు, హెచ్‌ఎం ఆనందబాబు ఉన్నారు.